ఓం సమర్థ సద్గురు శ్రీ సాయినాథాయ నమః

శ్రీ సాయి లీలామృతము

అధ్యాయము - 17

ఉపదేశాలు II

అనుగ్రహబలము

ముముక్షువైనవాడు శ్రోత్రియుడు, బ్రహ్మనిష్ఠుడూయైన గురువునే, సమిధలు చేత పట్టుకొనిపోయి ఆశ్రయించాలని ఉపనిషత్తులు చెప్పాయి. ఆ గురువు నిరతాగ్ని హోత్రపరాయణుడుగా గూడా వుండాలని దీనిభావం. బ్రహ్మనిష్ఠులెక్కడో ఒక్కరైనా దొరకవచ్చు. శ్రోత్రియులెందరో దొరకవచ్చు; నిరతాగ్నిహోత్ర పరాయణులు గూడ ఎక్కడో ఒక్కరైనా దొరకవచ్చు. కాని యీ మూడు లక్షణాలూ గల సద్గురువు దొరకడం యెంతో కష్టం.

ఈ కాలంలో అది దాదాపు అసంభవమనే చెప్పాలి. శ్రీసాయి అట్టివారే. ఆయన బ్రహ్మనిష్ఠులని ఎందరో గుర్తించారు. ఆయన నిరతాగ్నిహోత్రియన్న సంగతి అందరూ చూచిన విషయమే. కాని ఆయన సాటిలేని శ్రోత్రియులన్న సంగతి తెలుసుకున్నవారెంతో అరుదు. కారణం శ్రోత్రియులను గుర్తించగలగాలంటే మనకెంతో శాస్త్ర ప్రావీణ్యం వుండాలి. అంతేగాదు. శ్రోత్రియులంటే నిజానికి వేదమెరిగిన వారే; వేదవిదులే. మహాపతివ్రత తన సౌందర్యాన్ని, ప్రేమనూ సంపూర్ణంగా తన భర్తకు మాత్రమే ఏకాంతంలో యెలా సమర్పించుకుంటుందో, అలానే వేదంగూడ అర్హుడైనవానికే తన అర్థమంతటినీ తెలియనిస్తుందని, వారే వేదవిదులనీ వేదమే చెప్పింది. బాబా అలాంటి వారే. ఆయనకు ముస్లింలకు వేదమైన ఖురాను మాత్రమేగాక, వేదంగూడ తన జ్ఞానసంపదనంతటినీ సమర్పించింది.

కొందరు దక్షిణాది బ్రాహ్మణులు దేశసంచారం చేస్తూ, వేద పండితులను సాయి ఘనంగా సత్కరిస్తారని విని, శిరిడీ చేరారు. సాయి ముస్లింవలె వుండడంతో ఆయనకు నమస్కరించక, వాళ్ళు ప్రత్యామ్నాయ పద్ధతిన నేలమీద పిడికళ్ళుంచి, భగవంతుని పాదాలని భావించి నమస్కరించి, వేదం చదువనారంభించారు. కాని ప్రతిసారీ మధ్యలో మంత్రం మరచారు. అపుడు బాబా నవ్వి, వారికి మంత్రం అందించేసరికి వారు ఆశ్చర్యపోయారు. అపుడు బాబా కొంటెగా నవ్వి "మీరు ఎవరికి నమస్కరించారో వారినుండే కానుక పొందండి!' అన్నారు. భగవదనుగ్రహం పొందడానికే వేదం చదవాలిగాని, లౌకికమైన కానుకలకోసం గాదని వారిభావం. తర్వాత వారిని బాబా ఘనంగా సత్కరించి పంపారు. అసలు అనుగ్రహించవలసింది వారేగా!

సద్గ్రంథపఠన గూడ సద్గురుని అనుగ్రహంవల్లనే సార్థకమవుతుంది. అనుగ్రహానికి భక్తే సాధనంగాని, యుక్తి గాదు. "జ్ఞానేశ్వరి" పారాయణ ఎప్పుడు మొదలు పెట్టినా దేవ్‌కు ఏదో ఒక ఆటంకమొస్తుంటే, దానిని బాబా చేతి మీదగా తీసుకోదలచి, అందులో ఒక్క రూపాయి వుంచి ఆయనకివ్వాలనుకున్నాడు. వెంటనే ఆయన కోరి అతనివద్ద రు. 20/-లు తీసుకున్నారే గాని, పారాయణ విషయమే ఎత్తలేదు. అప్పుడతడు మాన్కర్ అనే భక్తుడు వారి కృపనెలా పొందగల్గాడో చెప్పమని అతనిని అడిగాడు. తక్షణమే బాబా అతనిని రప్పించి, రూ. 20/-లు దక్షిణ వసూలు చేసారు. దేవ్ మరల మర్నాడు మాన్కర్‌ను ఆ విషయమే అడిగాడు. వెంటనే సాయి మరలా అతనిని పిలిపించి, రూ25/- లు అడిగి తీసుకొని కోపంతో, "నీవు మశీదులోనే కూర్చో! నా గుడ్డపీలికలెందుకు దొంగిలిస్తావు?

తలనెరిసినా యీ పద్ధతి పోలేదా? గొడ్డలితో నరుకుతా జాగ్రత్త!" అని కేకలేసారు. అతడికేమీ అర్థంగాలేదు. నాటి మధ్యాహ్నం బాబా అతనితో ప్రేమగా, "గుడ్డపీలికల విషయం చెప్పి నిన్ను బాధపెట్టానా? దొంగతనం చేస్తే ఒప్పుకోక తప్పదు. ఏం చేస్తాం? దైవమే సాక్షి!" అని, మరల రూ. 12/-లు దక్షిణ తీసుకున్నారు. "నీవు రోజూ ఉదయం వాడాలో 'జ్ఞానేశ్వరి' పారాయణ చెయ్యి. నీకు మంచి జరీశాలువ యివ్వదలచాను. చింకి గుడ్డలు దొంగిలించడమెందుకు!" అన్నారు. ఈసారి దేవ్‌కు పారాయణ చక్కగా సాగింది. అతడు భక్తితో సద్గ్రంథపఠన ద్వారా సాయి అనుగ్రహాన్ని పొందాలి గానీ, వారినీ, వీరినీ ఆశ్రయించకూడదని వారి భావం. సామాన్యుల బోధలు చింకి గుడ్డలు, సద్గురువిచ్చేది జరీ శాలువ! దానిని పొందాలంటే దానినివ్వగలవారినే అడగాలి!

ఎవరి సంస్కారానికి తగిన ఉపదేశం వారికివ్వగల్గడమే సద్గురువు యొక్క ప్రత్యేకత. లేకుంటే లెక్కకు మీరిన సద్గ్రంథాలే మానవులందరికీ మోక్షమిచ్చి వుండేవే గదా! ఎంతటి వైద్య గ్రంథమైనా, సమర్థుడైన వైద్యునితో సమానం కాదు గదా!

బాబా ఒకరోజు నానాసాహెబ్ నిమోన్కరుతో, "కాకా, నీవు రోజూ భాగవతం చదువరాదా?" అన్నారు. "చదవాలనే వున్నది. కాని నాకు సంస్కృతం రాదు" అన్నాడు నిమోన్కరు. "ఫర్వాలేదు, ఈ మసీదు తల్లే నేర్పుతుంది. చదువు" అన్నారు. అతడలాగే ప్రారంభించాడు. కొద్దికాలానికి అతడికా గ్రంథమర్థమై, దీక్షిత్, జోగ్, మొ॥న పండితులకు గూడ జటిలమైన శ్లోకాలు వివరించగల్గేవాడు. తన పాండిత్యం గురించి అతనిలో అహంకారం తలెత్తిందో ఏమో, కొన్నాళ్ళ తర్వాత అతనిని, "ఇతరులకు చెప్పేందుకు మనమెవరం? దాని వలన మనలో అహం బలపడుతుంది" అని వారించారు సాయి. ప్రతివారూ నిమోన్కర్ వలెనే సద్గ్రంథాలు అర్థంగావడానికి సాయి వంటి సద్గురుని కృప పొందాలి.

దాసగణుకు ఈశావాశ్యోపనిషత్తు సరిగా అర్థంగాలేదు. పండితులెవ్వరూ అతనికి తృప్తిగా వివరించ లేకపోయారు. బ్రహ్మజ్ఞానియే వివరించగలరని తలచి బాబాను కోరాడు. సాయి, "ఇందులో కష్టమేముంది? తిరిగి వెళ్ళేటప్పుడు కాకాదీక్షిత్ ఇంటిలో పనిపిల్ల నీ సందేహం తీరుస్తుంది" అన్నారు. సాయి పరాచికమాడారని అందరూ అనుకున్నారు గాని, దాసగణు మాత్రం ఆయన మాట పూర్తిగా నమ్మి కాకాదీక్షిత్ ఇంటికి వెళ్ళాడు. మరురోజే ఒక పాతచీర ధరించిన పనిపిల్ల గిన్నెలు తోముతూ అందమైన ఎర్రని చీర గురించి పాడుతోంది. దాసగణు జాలిపడి ఆమెకొక మంచిచీర యిప్పించాడు. మర్నాడు ఆమె ఆ కొత్తచీర ఇంట్లో దాచి, పాతచీరే కట్టుకొని వచ్చింది. అయినా ఆమె ముఖంలో సంతోషమలాగే వున్నది. ఆ సన్నివేశంలో ఈశోపనిషత్తు సారాంశం దాసగణుకు యిలా తోచింది : సుఖదుఃఖాలు మనోకల్పితాలు! సర్వమూ ఈశ్వరమయమని, ప్రసాదమనీ గుర్తించేవాడు ఏ పరిస్థితిలోనయినా ఆనందిస్తాడు. "

బాబా తమను సేవించేవారికి సాధనలో తగిన సూచనలిచ్చేవారు. సేవకుడు అబ్దుల్లా యిలా చెప్పాడు: "ఖురాను చదివేటప్పుడు కునికిపాట్లు పడవద్దని బాబా చెప్పారు. 'కొద్దిగా తిను, రుచులకు పోవద్దు, ఒక్క వంటకం చాలు. ఎక్కువ నిద్రపోవద్దు' అన్నారు. . . . . నేను ఒకరాత్రి ప్రార్థనచేస్తూ అరచేతుల్లో ముఖముంచుకొని కునుకుతీసాను. అపుడు సాయి, 'చంద్రుణ్ణి చూడ యత్నిస్తున్నావా ఏమి?' అన్నారు. నేను కొద్దిసేపటికి మళ్ళీ నిద్ర తూగి ఆయనమీద పడ్డాను. ఆయన ప్రేమతో నా పాదాలు తట్టి లేపారు. నేను మరురోజు మధ్యాహ్నం దోసిట్లో నీళ్ళు తీసుకున్నప్పుడు అందులో స్పష్టంగా చంద్రబింబం గోచరించి, పులకించిపోయాను. ఆ దర్శనం ప్రసాదించబోతామని ఆయన ముందుగా చెప్పారు. ఒక్కొక్కసారి ఆయన నన్ను చెడ్డగా తిట్టేవారు. నన్నూ, జోగ్‌నూ కొట్టారుగూడ! అదీ ఆశీర్వచనమే!

ఆశ్రితుల భక్తి విశ్వాసాలను బాబా ఎన్నో రీతుల పటిష్టం చేసేవారు. ఆయన అప్పుడప్పుడూ భక్తులకు పంచడానికి దుకాణంనుండి మిఠాయి తెప్పించేవారు. ఆ వర్తకుడు 1916లో ఒకరోజు ప్లేగుతో మరణించాడు. శవమింకా అక్కడే వున్నది. బాబా అప్పుడే మిఠాయితెమ్మని నార్కేను పంపారు. ధైర్యముంటే అలమరాలోని మిఠాయి తీసుకుపొమ్మని ఆ వర్తకుని భార్య చెప్పింది. అతడు భయపడుతూనే మిఠాయి తీసుకెళ్ళాడు. బాబా అదే ప్రసాదంగా పంచి నార్కేతో, "అది తింటే చచ్చిపోతావని, ఊరు విడిస్తే బ్రతుకుతావనీ అనుకుంటున్నావు. అలా ఎన్నటికీ జరగదు. ఎక్కడున్నా సమయమొచ్చినపుడు మృత్యువు కొడుతుంది" అన్నారు. బాబా ఒక్కొక్కసారి కుష్ఠురోగులచేత ఊదీ అందరికీ యిప్పించేవారు. అయినా ఎవరికీ ఏ ప్రమాదమూ జరుగలేదు. శ్రీమతి మేనేజర్ యిలా చెప్పింది : "వెళ్ళిపోతున్న ఒక కుష్ఠురోగిని వెనక్కు పిలిచి అతని మూటలోని పాలకోవా నాకిచ్చారు. ఆయనచర్య ఎవరికీ అర్థంకాలేదు. కాని సాయి నా అసహ్యం గుర్తించి నాకు నమ్రత, సహనము, సోదరభావము బోధిస్తున్నారని నాకు తెలుసు. ఆయన శక్తి ఆరోగ్యసూత్రాలకు అతీతమని గుర్తించాను.

ఒకరోజు సీతాఫలాలు అమ్మే మనిషి ఫలాల వెల ఎక్కువ చెప్పింది. సాయి చాలాసేపు బేరమాడి 10 అణాలకు 6 పండ్లు కొన్నారు. ఇంతలో మరొకామె ఆ పండ్లే తెచ్చింది. ఆమెను 6 అణాలకు 10 పండ్లిమ్మన్నారు బాబా. ఆమె వెంటనే యిచ్చింది. అపుడు సాయి చెరో రూపాయి యిచ్చి "మొదట వచ్చిన పండ్లకు గిరాకీ ఎక్కువ గనుక 6 పండ్లకు 10 అణాలు, తర్వాత వచ్చిన పండ్లకు విలువ తగ్గుతుంది గనుక తక్కువ వెల నిర్ణయించాము. అయినా ఎవరి పుణ్యఫలం వారు పొందారు" అన్నారు. **పుణ్యసూత్రమెలా పనిచేస్తుందో!**

సాయి అనుగ్రహం ఒక్కొక్కప్పుడు మాటలకందని అనుభూతిగా భక్తులకు లభించేది. 'నారాయణాశ్రం' యిలా చెప్పాడు : 'భక్తుల ఆత్మ వికాసానికి బాబాగారి ప్రత్యక్ష సాన్నిధ్యమక్కరలేదు. మశీదులోనేగాక గదిలోగూడ వారి ప్రభావముండేది. అయితే బాబా ప్రసాదించేదంతా స్వీకరించగలవారెవరూ లేరు గాబోలు, ఆయన తర్వాత వారి స్థానానికెవ్వరూ వారసులు కాలేదు. వారి స్పర్శ కొన్ని చిత్రమైన అనుభవాలు, శక్తులూ ప్రసాదించేది. ఒక్కొక్కసారి భక్తుని తలను ఒక ప్రత్యేకరీతిన స్పృశించేవారు. లేక అపవిత్ర భావాలను అణచివేస్తున్నట్లు భక్తుని శిరస్సుపై గట్టిగా నొక్కేవారు. లేక పదేపదే తట్టేవారు. అలాగాకుంటే భక్తుని శిరస్సు, వెన్ను చిత్రమైన రీతిన నిమిరేవారు. ఒక్కొక్క స్పర్శకు ఒక్కొక్క ప్రభావముంటుంది. ఆయన అదృశ్యంగా గూడ భక్తునిలో అద్భుతమైన మార్పు తెచ్చేవారు. నాకు 1914లో శిరిడీ వెళ్ళినపుడు ఆయన మౌనంగానే, ఈ సృష్టిలోని భేదాలు అసత్యమని, అన్నింటికి ఆధారమైన దొక్కటే సత్యమన్న అనుభవమిచ్చారు. కాని నాకు తెలిసినంతలో ఆయన మాటలలో యిలా ఎన్నడూ చెప్పలేదు' అదే దక్షిణామూర్తి తత్త్వమని ఆదిశంకరులు కీర్తించారు. జనార్దన్ గల్వంకర్ (బాంద్రా) యిలా వ్రాశాడు; "సాయి 1917లో ఒకసారి తమచేయి నా తలమీదుంచగానే నాకో చిత్రమైన అనుభూతి కలిగి, పరిసరాలనేగాక నన్ను నేనే మరచాను. ఆనాటినుండి నాకు ఆధ్యాత్మికతపై శ్రద్ధ కలిగింది. అలానే ఒకరోజు ఖాపర్డేకు సాయి పదేపదే చిలిం అందించారు. అతడా పొగపీల్చగానే అతడి సందేహాలన్నీ తీరి ఎంతో ఆనందం కల్గింది. చిలిమ్‌లో సాయి పొగాకు మాత్రమే వేసుకున్నారు సుమా!

బాబా సందేశం సమయానికి వచ్చిన సద్గ్రంథాల ద్వారా గూడ భక్తులకు చేరేది. అంబేద్కర్ 7 సం॥లు యెన్నో కష్టాలు పడ్డాడు. ఎన్నిసార్లు శిరిడీ వెళ్ళినా అవి తొలగలేదు. చివరకు బాబా సన్నిధిలో ప్రాణం విడిస్తే మరుజన్మైనా బాగుండవచ్చని తలచి 1916లో శిరిడీ చేరాడు. అతడు దీక్షిత్ వాడావద్ద కూర్చొని ఆలోచిస్తుంటే, సగుణమేరూనాయక్ అతనికొక పుస్తకమిచ్చాడు. అది తెరవగానే వచ్చిన ఘట్టమిది : అక్కల్‌కోటస్వామి భక్తుడొకడు కష్టాలోర్వలేక ఒక బావిలో దుకాడు. స్వామి అతనిని రక్షించి, 'కర్మ అనుభవించక తప్పదు. ఇలా తప్పుకుంటే

మళ్ళీపుట్టి అనుభవించాలి. దానికి ఆత్మహత్యా పాపం తోడవుతుంది. అంతకంటే ఒకేసారి అనుభవించేస్తే మేలు' అన్నారు. తర్వాత అంబేద్కర్ మశీదు చేరగానే, "నీవు అక్కల్‌కోట స్వామి చెప్పినదానినే అనుసరించు" అన్నారు బాబా. అలానే ఒకసారి 'పరమహంస' లక్షణాలు సాయి చెప్పాలని తలచాడు శ్యామా. అతనిని వెంటనే వెళ్ళి దీక్షిత్ చెబుతున్న పురాణం వినమన్నారు బాబా. అతడు వెళ్ళేసరికి భాగవతం (11:18) లోని పరమహంస లక్షణాలు వివరిస్తున్నాడు దీక్షిత్. సం॥ 1909లో ఒకరోజు మశీదులోనున్న శ్యామరావు మనస్సులో ఒక ప్రశ్న వచ్చింది. బాబా అతనిని వెంటనే ఒక దేవాలయంలో ఒక భక్తురాలు చదువుతున్న పురాణం వినమన్నారు. అతడు వెళ్ళేసరికి ఆమె చదువుతున్న శ్లోకం అతనికి సమాధానమైంది.

★★★